VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464
కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 55
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శనివారం 25 జూలై 2026

# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

- తల్లిదండ్రులు-టీచర్లు కలిస్తేనే విద్యార్థుల విజయం
- మెగా పీటీఎంతో విద్యా వ్యవస్థలో కొత్త అధ్యాయం
- ప్రభుత్వ బడులపై పెరుగుతున్న నమ్మకం
- సంక్షేమం విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- గిరిజనులకు అండగా ఉంటాం... ఆందోళన వద్దు
- రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు









**రంపచోడవరం,కలంకౌంటర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన.. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఇప్పటికే గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల నుంచి లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల మార్కులు తగ్గితే అది విద్యాశాఖ పనితీరుపైనే ప్రతిబింబిస్తుందని, అందుకే మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. విద్యే పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి అని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు రాణించడానికి విద్యే కారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధి బాధ్యతను తల్లి, తండ్రి ఇద్దరూ సమానంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులేనని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పీటీఎంలను నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా బోధనా విధానాలను మార్చుకోవాలని, కొత్త పద్ధతులను అవలంభించాలని సూచించారు. టీచర్లకు ప్రభుత్వం సముచిత గౌరవం ఇస్తోందని, బదిలీలను పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**విద్యతో పాటు ఆరోగ్యం, ఉపాధిపైనా ప్రత్యేక దృష్టి..** రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. తల్లికి వందనం పథకం నిధులు ఇప్పటికే తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయని చెబుతూ జమ అయ్యాయా లేదా అంటూ సభలోనే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, సోలార్ విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రజారోగ్యంపై దృష్టి సారించామని... ఆగస్టు నుంచి సంజీవని హెల్త్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని తెలిపారు. పైగా 14 శాతం మేర వడ్డీలకు కొన్ని అప్పులను తెచ్చిందని

- 2లో

## చేపలవేట దుర్ఘటన.. మృతుల కుటుంబ సభ్యులతో నారా లోకేశ్ ఆత్మీయ సమావేశం

- గోదావరి నదిలో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించిన మంత్రి లోకేశ్
- బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ
- సీఎం చంద్రబాబుతో కలిసి రంపచోడవరంలో పర్యటించిన లోకేశ్
- మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లోనూ పాల్గొన్న సీఎం, మంత్రి



**పోలవరం జిల్లా గొల్లగూడెం,కలంకౌంటర్ :** పోలవరం జిల్లాలో ఇటీవల గోదావరి నదిలో చేపలవేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. రంపచోడవరంలో పర్యటించిన ఆయన, బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. వారికి ప్రభుత్వం, పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "పోలవరం జిల్లా గొల్లగూడెం వద్ద గోదావరిలో చేపలవేటకు వెళ్లి ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఊకె సుశీల, తుర్రం భారతి, బాసిబోయిన బాలరాజు, ఊకె రమేశ్ కుటుంబ సభ్యులను రంపచోడవరంలో కలిశాను. బాధిత కుటుంబ సభ్యులకు ఏ కష్టమొచ్చినా తాను అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చాను" అని తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి మంత్రి లోకేశ్ శుక్రవారం రంపచోడవరంలో జరిగిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్'లో పాల్గొన్నారు. ఈ అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకే ఆయన జిల్లాకు విచ్చేశారు. ఈ పర్యటనలోనే ఆయన ఇటీవల జరిగిన దుర్ఘటన బాధితులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కొద్ది రోజుల క్రితం ఏటపాక మండలం గొల్లగూడెం సమీపంలో గోదావరి నదిలో చేపలవేటకు వెళ్లిన ఐదుగురు గిరిజనులు నీట మునిగి మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ వారి కుటుంబాలను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు.

## పలమనేరు క్యాంపు నుంచి పార్వతీపురానికి కుంకీ ఏనుగుల తరలింపు

- మార్గమధ్యంలో మంగళగిరి వద్ద స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- కుంకీలకు స్వయంగా ఆహారం అందించిన ఉప ముఖ్యమంత్రివర్యులు
- జెండా ఊపి గుచ్చిమి క్యాంపుకు సాగనంపిన పవన్ కళ్యాణ్



**మంగళగిరి,కలంకౌంటర్ :** పార్వతీపురం మన్యం జిల్లాలో మానవ-ఏనుగు సంఘర్షణల నివారణ చర్యలను బలోపేతం చేసే దిశగా పలమనేరు ముసలమడుగు ఏనుగుల శిబిరం నుంచి గుచ్చిమి ఏనుగుల శిబిరానికి తరలిస్తున్న శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. గజరాజులకు మార్గమధ్యంలో పూలు చల్లి స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రివర్యులు, వాటికి స్వయంగా ఆహారం అందజేశారు. అనంతరం గుచ్చిమి శిబిరానికి బయలుదేరిన కుంకీల రెండో అంచె ప్రయాణాన్ని జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా ప్రయాణంలో కుంకీల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ అధికారులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. గుచ్చిమి క్యాంపునకు చేరిన అనంతరం నిపుణుల పర్యవేక్షణలో అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటుపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జయంత్, అభిమన్యుల సేవలు పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో మానవ-ఏనుగు ఘర్షణల నియంత్రణకు ఎంతో ఉపయోగపడనున్నాయని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలిపారు. ప్రజల భద్రత, రైతుల పంటల రక్షణ, వన్యప్రాణుల సం రక్షణ లక్ష్యాలను కూటమి ప్రభుత్వం శాస్త్రీయ, మానవీయ విధానాలతో చేపడుతున్న చర్యల్లో భాగంగా కుంకీలను తరలిస్తున్నామని అన్నారు.

**- ఒడిశా వైపు నుంచి ఏనుగులు ..** ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఏనుగుల గుంపులు తరచూ పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశిస్తూ పంటలు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో, మానవ-ఏనుగు ఘర్షణల నివారణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ కుంకీ ఏనుగులను గుచ్చిమి శిబిరానికి తరలిస్తున్నారు. మానవ-ఏనుగు ఘర్షణల నివారణ చర్యల్లో భాగంగా కుంకీ ఏనుగులైన జయంత్, అభిమన్యులను వినియోగిస్తారు. గతంలో పలమనేరు, చిత్తూరు ప్రాంతాల్లో నిర్వహించిన పలు కీలక ఆపరేషన్లలో ఈ రెండు కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషించాయి. అడవి ఏనుగుల గుంపులను సురక్షితంగా అటవీ ప్రాంతాలకు మళ్లించడంలో ఎంతో చురుకుగా వ్యవహరించాయి.

## రాష్ట్ర వైద్యానికి 'సంజీవని' జవసత్వాలు

- 10.51 లక్షల మందికి సమగ్ర ఆరోగ్య ఖాతాలు
- 2.48 లక్షల మంది రోగులకు వైద్యులతో నేరుగా అపాయింట్‌మెంట్లు
- ఎన్సీడీ 4.0 కింద గుర్తించిన 2.72 కోట్ల మంది ఆరోగ్య వివరాలు సంజీవనితో అనుసందానం
- 'ఆర్‌బియస్‌కె' విద్యార్థుల వివరాలు కూడా
- రేపు కర్నూలు జిల్లా ఆస్పరిలో 'సంజీవని'ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




**అమరావతి,కలంకౌంటర్ :** గ్రామంలో పరీక్ష చేయించుకున్న రోగి జిల్లా, బోధనాస్పత్రికి వెళ్లినా.. అతడి ఆరోగ్య చరిత్ర వెంటనే వైద్యుల ముందుకు వచ్చేలా రాష్ట్రంలో డిజిటల్ వైద్య వ్యవస్థ విస్తరిస్తోంది. పరీక్షలు, మందులు, వైద్య సంప్రదింపులు, రిఫరల్, తదుపరి చికిత్స.. ఇలా రోగికి సంబంధించిన ప్రతి సేవను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే 'ప్రాజెక్టు సంజీవని' రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థలో కీలకంగా మారుతోంది. కుప్పంలో ప్రయోగాత్మకంగా మొదలైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 10.51 లక్షల మందికి సమగ్ర ఆరోగ్య ఖాతాలను డిజిటల్ విధానంలో రూపొందించారు. వైద్య సేవలు పొందేందుకు 10.06 లక్షల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలను అనుసంధానం చేశారు. రోగి ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి వెళ్లినప్పుడు వైద్య సమాచారానికి ఇబ్బంది లేకుండా .. చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షించే వ్యవస్థను దశలవారీగా బలోపేతం చేస్తున్నారు. కర్నూలు జిల్లా ఆస్పరిలో శనివారం సంజీవని కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన పురోగతిని మంత్రి వివరించారు.

**ఒక్కొక్కరికీ ఒక్కో ఆరోగ్య ఖాతా..** సంజీవని ద్వారా ప్రతి వ్యక్తికి ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య ఖాతాను రూపొందిస్తున్నారు. గతంలో వచ్చిన వ్యాధులు, వైద్యులు సూచించిన పరీక్షలు, ప్రయోగశాల ఫలితాలు, వాడిన మందులు, ఆస్పత్రుల్లో పొందిన చికిత్స, తదుపరి వైద్య సూచనలను ఇందులో నమోదు చేస్తున్నారు. గ్రామ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందిన వ్యక్తి మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీ, ఏరియా, జిల్లా లేదా బోధనాస్పత్రికి వెళ్లినా.. అప్పటివరకు నమోదైన ఆరోగ్య వివరాలు వైద్యులకు క్షణాల్లో అందుబాటులోకొస్తాయి. పాత నివేదికలు తీసుకెళ్లకపోయినా గత చికిత్స వివరాలను పరిశీలించి వైద్యం అందించే అవకాశముంటుంది. దీనివల్ల వ్యాధుల నిర్ధారణ పరీక్షల ఫలితాలు, గతంలో వాడిన మందులు

- 2లో



## పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ చింతకాయల విజయ్



**న్యూఢిల్లీ ,కలంకౌంటర్ :** పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యసభ నిబంధనావళిలోని రూల్ 269(1) ప్రకారం రాజ్యసభ ఛైర్మన్ ఈ నియామకాన్ని చేపట్టినట్లు సచివాలయం ప్రకటనలో తెలిపింది. 2026 జూలై 23వ తేదీ నుండి ఈ నియామకం అమలులోకి వచ్చినట్లు పేర్కొంది. దేశంలో పారిశ్రామిక రంగానికి సంబంధించి కీలకమైన విధానపరమైన నిర్ణయాలు, సమీక్షలు నిర్వహించే ఈ కమిటీలో చింతకాయల విజయ్ సభ్యుడిగా వ్యవహరించనున్నారు.

## రూ.1.27 లక్షల సీఎంఆర్ఎఫ్ అందించిన ఎమ్మెల్యే



**కావలి,కలంకౌంటర్ :** ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్ర వారం శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, కావలి రూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీ పరిధిలోని ఒట్టూరు గ్రామానికి చెందిన పొన్నాడి అన్నపూర్ణమ్మ కి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1,27,657/- విలువైన ఎల్ఓసీ ఆర్థిక సహాయ పత్రాన్ని అందజేశారు.

## మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చండి

- తల్లిదండ్రులకు ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు
- అడవిరాజుపాలెంలో మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ లో పాల్గొన్న ఎమ్మెల్యే







**కందుకూరు,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నిర్వహించిన మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ 4.0 గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం జడ్పీ హైస్కూల్ లో శుక్రవారం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, నేతల సందడితో కోలాహలంగా సాగింది. శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జగన్ లాగా మేము మాట తప్పలేదు. ప్రతిఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే, అంతమందికి తల్లికి వందనం ద్వారా 15వేలు ఇచ్చాం. నియోజకవర్గంలో 31,330 మంది పాఠశాల విద్యార్థులకు 40.72 కోట్ల రూపాయలు, 4,149 మంది కాలేజీ విద్యార్థులకు 5.39 కోట్ల రూపాయలు... మొత్తంగా 35,479 మంది విద్యార్థులకు 46 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయి. తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు.నారా లోకేష్ కృషితో ప్రభుత్వ పాఠశాల్లో మార్పులు వచ్చాయి. డీఎస్సీ ద్వారా ప్రతిభ కలిగిన టీచర్లు వచ్చారు. వసతులన్నీ చక్కగా ఏర్పాటయ్యాయి. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. ముఖ్యంగా ప్రతి ఆడబిడ్డను విద్యాధికురాలిని చేయాలి... అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.గత ప్రభుత్వంలో జీతాలు ఎప్పుడు ఇస్తారో తెలిసేది కాదు. ఇప్పుడు ఒకటవ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్న పరిస్థితి ఉంది. కేవలం బటన్ నొక్కిన ప్రభుత్వానికి, హామీలను నిలబెట్టుకుంటున్న ప్రభుత్వానికి తేడా గుర్తించండి. మంచి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి... అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు వచ్చే ఏడాది నాటికి హైస్కూల్ కు గ్రౌండ్ మరియు 6 తరగతి గదులు ఏర్పాటు చేస్తానని,గ్రామ సమీపంలో ఎలికేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణంతో పాటు కావలికి తారురోడ్డు సౌకర్యం కల్పిస్తానని గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని, భోజనం చేశారు. స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల గురించి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ రవి, ఎంఈఓ లు గోవర్ధన్, హరి రామ్ , ఎంపీడీవో మల్లికార్జునరావు, మండల టిడిపి మండల అధ్యక్షులు జానిగర్ల నాగరాజు, మండలంలోని అన్ని గ్రామాల టిడిపి అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ఆ అప్పులను నెమ్మదిగా తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని.. అలాగే వడ్డీలు తగ్గించేలా కసరత్తు చేస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమతూకంగా కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలను విస్తరిస్తామని వెల్లడించారు. హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని గుర్తుచేశారు. తన పాలనలో 16 ఏళ్లలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించానన్నారు. ఈ ఏజెన్సీ ఏరియాలో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో రిక్రూటైన ఉపాధ్యాయులే ఉన్నారని దానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ, తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చప్పామిని.. దానికి అనుగుణంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాము కూటమిగా రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని... మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు రిక్రూట్ చేస్తే... దానిపై బురద జల్లుతున్నారని సీఎం విమర్శించారు. రిక్రూటైన టీచర్ల మనోభావాలను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇలాంటి వారిని కట్టడి చేయాలని సూచించారు. రాజకీయ నేతలు, అధికారులు తేడాగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో గతంలో కొందరు దుర్మార్గాలు చేశారని... దళిత డ్రైవరును చంపి డోర్ డెలివరి చేసిన నేతలు ఇక్కడ రాజకీయం చేశారని గుర్తు చేశారు. తల్లిని, చెల్లిని గౌరవించని వాళ్లు సమాజానికి ఏం చెబుతారు..? ఏం మేలు చేస్తారని.. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదని సీఎం అన్నారు. మంచిని ప్రోత్సహించాలి... చెడును తప్పు పట్టాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని... ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ.. వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తున్నామని చెప్పారు. 94 శాతం స్ట్రైక్ రేటుతో గడచిన ఎన్నికల్లో గెలిపించారని... వచ్చే ఎన్నికల్లో అంతకు మించిన గెలుపును సాధిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

**డ్రగ్స్‌కు చెక్... గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం..** గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును అరికట్టి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కల్పించామని గుర్తు చేశారు. పిల్లలకు చక్కటి విద్యను అందిస్తామని... ఉద్యోగాలకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా పెద్దపెద్ద పరిశ్రమలను తెస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖకు గూగుల్ సంస్థ వచ్చిందని... భోగాపురం ఎయిర్ పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ భోగాపురం ఎయిర్ పోర్టును ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు కష్టపడకుండా.. ఇష్టపడి చదవాలని... ఐదేళ్లు కష్టపడి చదివితే పెద్ద పెద్ద పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేలా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పోలవరాన్ని నెంబర్-1 జిల్లాగా తయారు చేస్తామని... 2000లో జీవో నెంబర్-3 తెచ్చి.. స్థానిక గిరిజనులకే ఉద్యోగాలిచ్చేలా అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. కానీ 2020లో సుప్రీం కోర్టు ఆ జీవోను రద్దు చేసిందని... దీనిపై ఇప్పుడు చర్చిస్తున్నామని గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.








**విద్యార్థుల కలలకు సీఎం ప్రోత్సాహం..** సభలో పలువురు విద్యార్థులు తమ లక్ష్యాలు, ఆశయాలను వెల్లడించగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వారిని అభినందించారు. తాను భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిగా మారి ముఖ్యమంత్రికి రిపోర్ట్ చేస్తానని చెప్పిన విద్యార్థి సాత్విక్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందిస్తూ, అతని సంకల్పం తప్పకుండా నెరవేరుతుందని ఆకాంక్షించారు. "డేర్ టు డ్రీమ్... స్ట్రైవ్ టు అచీవ్" అనేది తాను ఎప్పుడూ చెప్పే సందేశమని పేర్కొన్న సీఎం... పిల్లలను ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా వారితో నిరంతరం సంభాషించాలని సూచించారు. పోలవరం ప్రాంతం నుంచి ప్రపంచానికి సేవలందించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ రూపొందించిన "డ్రగ్స్ వద్దు బ్రో" హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం "బడి కోసం డోనర్" వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభమైన వెంటనే మీ సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ రంపచోడవరం హైస్కూల్‌కు రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. నెల్లూరు జిల్లా జెడ్పీ హైస్కూల్‌కు పారిశ్రామికవేత్త పూర్ణ చంద్రరావు రూ.4 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. వీరిద్దరిని సీఎం చంద్రబాబు అభినందించారు. అలాగే సభా వేదిక మీద నుంచి పోలవరం జిల్లాలో వివిధ శాఖల పనితీరును ముఖ్యమంత్రి వివరించారు. పనితీరు బాగా కనబరిచిన అధికారులను అభినందించిన ముఖ్యమంత్రి... సభికులతోనూ చప్పట్లు కొట్టించారు.

**పేరెంట్స్, టీచర్లతో ముఖాముఖి..** మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందర్భంగా రంపచోడవరం ప్రభుత్వ హైస్కూలు, జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, మార్కులు, హాజరు, ఆరోగ్య వివరాలను స్వయంగా పరిశీలించి తల్లిదండ్రులకు వివరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రిపోర్టు కార్డులను వారి ఇళ్లకే పంపేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మరో తరగతి గదిలో స్మార్ట్ బోర్డు ద్వారా బోధనా విధానాన్ని పరిశీలించిన సీఎం.. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని ఉత్సాహపరిచారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాటిన మొక్కలను పరిశీలించిన సీఎం.. గ్రీన్ పాస్‌పోర్టు, క్యూఆర్ కోడ్ ఆధారంగా మొక్కల వివరాలు తెలుసుకునే విధానాన్ని అభినందిస్తూ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మెగా పీటీఎం ఫొటోఫ్రేమ్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫొటో దిగారు.

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సీఎం..** మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి ఎలా ఉందని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం మరింత మెరుగ్గా అందించాలని సీఎం సూచించారు. విటమిన్ లోపాలు రాకుండా పోషకాహారం అందిస్తున్నామని, కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంతో పాటు చిక్కి, ఉదయం రాగిమాల్ట్ అందిస్తున్నామని చెప్పగా, ఇంటికి వెళ్లే ముందు కూడా చిక్కిలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు వారితో కలిసి ప్రత్యేకంగా ఫొటోలు దిగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన సేవలు అందించేందుకు స్వర్ణ భవిత వనరుల కేంద్రాలు దోహదపడాలి

### -రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్



**రేపల్లె, కలంకౌంటర్ :** ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన సేవలు అందించేందుకు స్వర్ణ భవిత వనరుల కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రేపల్లె మండల కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.29.30 లక్షలతో నూతనంగా నిర్మించిన స్వర్ణ భవిత ప్రత్యేక అవసరాల గల పిల్ల వనరుల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.,తో కలసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.29.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన స్వర్ణ భవిత ప్రత్యేక అవసరాల పిల్లల వనరుల కేంద్రాన్ని ప్రారంభించి వివిధ గదులు, సౌకర్యాలను పరిశీలించి అక్కడ విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. వారికి నాణ్యమైన విద్య, చికిత్స, థెరపీ, పునరావాస సేవలు ఒకే వేదికపై అందించాలనే లక్ష్యంతో స్వర్ణ భవిత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి చిన్నారి ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తును మరింత మెరుగుపరిచేలా అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమైన విద్యా, వైద్య, థెరపీ సేవలను సమగ్రంగా అందించేందుకు జిల్లాలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. స్వర్ణ భవిత కేంద్రం ద్వారా పిల్లలకు నిపుణుల సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ.బి.శ్రీదేవి, డి ఐ ఓ.కోదండరామ్, డి ఈ ఓ.శ్రీనివాస్ సింగ్, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్ర వైద్యానికి 'సంజీవని' జవసత్వాలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

తెలియకపోవడం, వైద్య నివేదికలు అందుబాటులో లేక చికిత్స ఆలస్యం కావడం వంటి ఇబ్బందులు తగ్గుతాయి.

**కుప్పం నుంచి ప్రారంభమై...** చిత్తూరు జిల్లా కుప్పంలో జులై 3,2025, జనవరి 13, 2026న చిత్తూరు జిల్లా నారావారి పల్లెలో, మార్చి 15 నుంచి దశలవారిగా మే 23 నాటికి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. జూన్ 27,2026న మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కృష్ణంశెట్టి పిహెచ్‌సి పరిధిలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**గణాంకాలవారీగా..** 10.51 లక్షల మందికి సమగ్ర ఆరోగ్య ఖాతాలు రూపొందించారు. 10.06 లక్షల మందికి పేర్లతో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలు( అభా) సృష్టించారు. 3.62 లక్షల మందికి వైద్యుల నుంచి అపాయింట్‌మెంట్లు ఇప్పించారు. 2.48 లక్షల మంది రోగులు వైద్యుల్ని సంప్రదించారు. రోగుల్లో అవసరమైన వారికి ఇప్పటి వరకు 14.66 లక్షల మందుల్ని అందజేశారు. అలాగే రోగులందరికీ కలిపి 31,555 ల్యాబ్ పరీక్షలు జరిగాయి. రోగుల్లో 1.60 లక్షల మందికి ఫాలోఅప్ వైద్యం గురించి ఫోన్ ద్వారా తెలియజేశారు డిజిటల్ నర్వ్ సెంటర్ లో ఉన్న ఎంబిబియస్ వైద్యులు , స్పెషలిస్టులు కలిపి 7,000 మంది రోగులకు వైద్య సేవల్ని అందించారు

**రిఫర్ చేయడంతో వదిలేయకుండా..**రోగిని ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి పంపించిన తర్వాత అక్కడకు చేరారా? వైద్యుడిని కలిశారా? సూచించిన పరీక్షలు చేయించుకున్నారా? మందులు తీసుకుంటున్నారా? తిరిగి పరీక్షకు హాజరయ్యారా? అనే వివరాలను సంజీవని ద్వారా తెలుసుకుంటున్నారు. రిఫరల్, టెలివైద్య సంప్రదింపులు, నిపుణుల సూచనలు, ప్రయోగశాల పరీక్షలు, మందుల పంపిణీ, తదుపరి అపాయింట్‌మెంట్లు, ఫాలోఅప్ సేవలను ఒకే వ్యవస్థతో అనుసంధానిస్తున్నారు.

# మెగా పిటిఎం లో మంత్రి కొలుసు








**నూజివీడు,కలంకౌంటర్ :** రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారపౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో "తల్లికి వందనం- మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ (మెగా పిటియం)-4.0 " ను లాంఛనంగా ప్రారంభించి, కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

# ఉచితంగా ల్యాప్ టాప్ లు

## విద్యకు కోనా చేయూత







**కైకరం,కలంకౌంటర్** : ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు పేద ఆర్యవైశ్య విద్యార్థుల కు ల్యాప్ టాప్ లు ఉచితంగా అందజేశారు. ప్రతి జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం లో కుట్టు మిషన్లు,గ్రైండర్లు, స్కాలర్ షిప్ లు ఇస్తున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహణలో తనదైన మార్క్ చూపిస్తున్నారు.

# విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

## -ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి..




**కావలి,కలంకౌంటర్** : విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మంచి విలువలు అలవరచుకొని సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ 4.0' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావలి రూరల్ మండలం,అన్నగారి పాలెం పంచాయతీ పరిధిలోని ఒట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఒట్టూరు మోడల్ స్కూల్లో నిర్వహించిన సమావేశాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎమ్మెల్యే రాక సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, విలువల ఆధారిత నృత్య ప్రదర్శనలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి విద్యా అభివృద్ధిపై చర్చించే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యా రంగంలో అనేక వినూత్న సంస్కరణలు అమలు చేస్తోందనితెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, నాణ్యమైన ఫర్నిచర్, తాగునీటి వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.పిల్లల అభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. పాఠశాలకు పంపించడం మాత్రమే కాకుండా పిల్లల చదువుపై నిరంతరం పర్యవేక్షణఉండాలని, ఉపాధ్యాయులతో తరచూ సంప్రదింపులు జరపాలని సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు కలిసి పనిచేస్తే ప్రభుత్వ తీసుకుని పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని చెప్పారు.విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా మంచి నడవడి, క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత,పర్యావరణ పరిరక్షణ, పెద్దల పట్ల గౌరవం,సేవాభావం వంటి విలువలను జీవితంలో అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు అందించే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు."కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదు. ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులకు, తన గ్రామానికి, తన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా సమానంగా అవసరం. మంచి విద్యార్థులే రేపటి మంచి పౌరులు, మంచి నాయకులు అవుతారు" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థకు నూతన దిశ లభిస్తోందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని కొనియాడారు.



# గ్రంథాలయాల వ్యవస్థాపకుడు అయ్యంకి చిరస్మరణీయుడు...

## ● జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ బేగ్

**మచిలీపట్నం,కలంకౌంటర్** : కృష్ణాజిల్లా విజయ-ంవాడలో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకులు రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలు ఏర్పాటుకు ముఖ్య కారకుడైన అయ్యంకి వెంకటరమణ చిరస్మరణీయుడని కృష్ణాజిల్లా గ్రంథాలయాల సంస్థ అధ్యక్షులు ఎంకే బేగ్ అన్నారు. మారుతున్న సాంకేతికతవు అవసరాన్ని బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ సహకారంతో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు శుక్రవారం మచిలీపట్నం కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రాంగణంలో అయ్యంకి వెంకటరమణ 139 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలిఫోర్నియాలో ఉన్న వెంకటరమణ మనవడు డాక్టర్ అయ్యంకి మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గోపు సత్యనారాయణ నగర జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ కృష్ణ యూనివర్సిటీ కి చెందిన మద్దాల శ్రావణి అతిథులుగా హాజరై గ్రంథాలయాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు 2026 వేసవి సమ్మర్ క్యాంపు పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉత్తమ గ్రంథాలయ అధికారులుగా ఎంపికైన ఐదుగురికి సన్మానం చేశారు గత మూడు రోజులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ విద్యార్థి విద్యార్థినులకు నిర్వహించిన పోటీ పరీక్షలలో విజేతను కూడా బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ముదిగొండ శాస్త్రి కారుపత్తి రాజేంద్రప్రసాద్ భవిష్య నవరం వెంకటేశ్వరరావు మేడికొండ యోగేశ్వరరావు లైబ్రరీ సిబ్బంది నాని తదితరులు పాల్గొన్నారు



# స్వప్న వారాహి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ బగలాముఖి అమ్మవారు





**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్** : చందోలు గ్రామంలో గల శ్రీ బగలాముఖి అమ్మవారి దేవస్థానంలో గత 9రోజులుగా జరుగుతున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవాలలో ఈరోజు శ్రీ స్వప్న వారాహి అలంకారంలో శ్రీ అమ్మవారిని అనేకమంది భక్తులు దర్శించుకున్నారు ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా సంగుపాలెం కురప్పాలెం ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆషాడం బోనాలు, సారేలు పసుపు కుంకుమలు పొంగళ్ల సమర్పించారు ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాద పంపిణీ నిర్వహించారని ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీకాల కోట చక్రధర్ రెడ్డి ఈవో జి నరసింహమూర్తి తెలియపరిచారు

# జాషువా ఆశయాల బాటలో వైఎస్ జగన్ పాలన: మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

● ఘనంగా నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి ● సింగ్ నగర్ జనహిత సదనంలో చిత్రపటానికి నివాళులు


● అవమానాలనే ఆభరణాలుగా మలుచుకున్న మహనీయుడని కొనియాడటం ● మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



**విజయవాడ,కలంకౌంటర్** : సమాజంలో ఎదురైన ఛీత్కారాలనే సత్కారాలుగా, అవమానాలనే ఆభరణాలుగా మలుచుకుంటూ, మానవత్వమే పరమావధిగా జీవించిన మహోన్నత వ్యక్తి నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ?శుక్రవారం నగరంలోని సింగ్ నగర్ జనహిత సదనంలో గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి భావపూర్వకంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ, గుర్రం జాషువా తల్లిదండ్రులు వేర్వేరు కులాలకు చెందినవారు కావడంతో చిన్నతనం నుంచే సమాజంలో తీవ్రమైన వివక్షను, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఆనాటి సామాజిక రుగ్మతలను, అసమానతలను తన కలం బలం ద్వారా ప్రశ్నించారని కొనియాడారు. గబ్బిలం, ఫిరదౌసి, స్వప్నకథ వంటి శ్రేష్ఠమైన కావ్యాల ద్వారా సమాజానికి గొప్ప చైతన్యాన్ని అందించారన్నారు. గుర్రం జాషువా సాహిత్యానికి చేసిన అసమాన సేవలకుగాను సమాజం ఆయనను నవ-యుగ కవి చక్రవర్తి, కవి కోకిల, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ వంటి అనేక బిరుదులతో సత్కరించిందని తెలిపారు. బిరుదులకే వన్నె తెచ్చిన గొప్ప సాహిత్యమూర్తి ఆయన అని కొనియాడారు. ఆయన రాసిన ప్రతీ పద్యం సామాజిక సమరసతను, సమానత్వాన్ని నొక్కి చెప్పిందని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయన అడుగుజాడల్లో నడిచిందని గుర్తు చేశారు. ?గుర్రం జాషువా కలలు కనిన సమసమాజ స్థాపన దిశగా వైఎస్సార్‌సీపీ అడుగులు వేసిందని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలు అన్నింటిలోనూ నభూతో నభవిష్యత్ అన్నట్లుగా ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికీ చేయూతనందించి, వివక్ష లేని పాలనతో గుర్రం జాషువా కన్న కలలను వైఎస్ జగన్ నిజం చేశారని కొనియాడారు. మహనీయుల త్యాగాలను, వారు సమాజానికి అందించిన సేవలను స్మరించుకోవడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అని మల్లాది విష్ణు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ శైలజ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్, యర్రగొర్ల శ్రీరాములు, యర్రంశెట్టి అంజిబాబు, గుడిసె శ్యామ్, వంశీ, ప్రేమ్, నిరీక్షణ్, మాలిక్, నాగభూషణం, యల మంద, రామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుర్రం జాషువాకు నివాళులర్పించారు.

# ఇంజినీరింగ్ కళాశాలకు మరో ప్రతిష్టాత్మక గుర్తింపు

## ---దేశవ్యాప్తంగా టాప్-100 ఇంజినీరింగ్ కళాశాలల్లో చోటు దక్కించుకున్న ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల




**కందుకూరు,కలంకౌంటర్** : ప్రకాశం జిల్లాలోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) మరో ప్రతిష్టాత్మక గుర్తింపును సొంతం చేసుకుంది. హయ్యర్ ఎడ్యుకేషన్ రివ్యూ ఇంజినీరింగ్ సర్వే--2026లో దేశంలోని టాప్-100 ఇంజినీరింగ్ కళాశాలల్లో స్థానం దక్కించుకుని జాతీయ స్థాయిలో తన ప్రతిభను మరోసారి చాటుకుంది. కళాశాలలో అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ాదీజు) విధానంలో బోధన అందిస్తూ, విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. అత్యాధునిక ప్రయోగశాలలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఐఓటీ, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ డా. కంచర్ల విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, "నాణ్యమైన విద్య, పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. ఈ జాతీయ గుర్తింపు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిశ్రమ భాగస్వాములు, యాజమాన్యం సమిష్టి కృషికి లభించిన గౌరవం. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ గుర్తింపులు సాధించే దిశగా కృషి కొనసాగిస్తాం" అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, "ఈ జాతీయ గుర్తింపు కళాశాల విద్యా నాణ్యతకు నిదర్శనం. విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని అన్నారు.ఈ గుర్తింపు లభించిన సందర్భంగా కళాశాల యాజమాన్యానికి, శ్రేయోభిలాషులు, విద్యావేత్తలు, వివిధ వర్గాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా టాప్-100 ఇంజినీరింగ్ కళాశాలల్లో స్థానం దక్కించుకోవడం ప్రకాశం జిల్లాకే గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## --ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్




**కందుకూరు,కలంకౌంటర్** : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మెగా పేరెంట్--టీచర్స్ మీటింగ్ 4.0 (మెగా పీటీమ్ 4.0) కార్యక్రమంలో భాగంగా బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులను ఆప్యాయంగా పలకరించి, పాఠశాలలో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్య మౌలిక వసతుల డైరెక్టర్ పోకూరి రాంబాబు, ఎంఈఓ లు నాగపణి శర్మ,కే. సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసులు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రమణయ్య, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ద్వారకా రాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గా వక్కలగడ్డ రామమోహనరావు



అధ్యక్షుడు వక్కలగడ్డ రామమోహనరావు



కార్యదర్శి తాతా సీతారామ స్వామి



కోశాధికారి వక్కలగడ్డ సీతారామయ్య

**చీరాల,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా చీరాల మండల ఆర్యవైశ్య సంఘం నూతన అద్యక్షులుగా వక్కలగడ్డ రామమోహనరావు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. కార్యదర్శిగా తాతా సీతారామ స్వామి, కోశాధికారిగా వక్కలగడ్డ సీతారామయ్య లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. ఎలక్షన్ అధికారిగా కాకర్ల నరశింహారావు వ్యవహరించినారు. ఈ కార్యక్రమములో బాపట్ల జిల్లా అద్యక్షులు మారుటూరి రాఘవేంద్ర రావు, ఆలపాటి సుధాకర్, కోడూరి శివరామకృష్ణ, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వారాహి నవరాత్రోత్సవాలు

● వాసవి కన్యకా పరమేశ్వరి కి అభిషేకం ● వారాహి, కన్యకా పరమేశ్వరుల మూలమంత్ర హోమం
● సామూహిక కుంకుమార్చనలో 1500 మహిళలు ● చండీ సప్తశతి హోమం







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా 10వ రోజు రోజు శుక్రవారం ఉదయం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం స్నపన జరిగాయి. శత్రు పీడా పరిహారార్థం శ్రీ వారాహి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల మూలమంత్ర హోమం నిర్వహించారు. వారాహి అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చన లో 1500 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. నీరాజన మంత్రపుష్పాలు తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం సకల కార్యసిద్ధి కొరకు చండీ సప్తశతి బ్రహ్మ విద్యా మూల మంత్ర హోమం (చండీ హోమం) నిర్వహించారు. రాత్రి నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. పొక్కునూరి హరనాథ శర్మ అవధాని బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ సభ్యులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్,సామా వెంకటలక్ష్మి కాంతారావు, బైసాని హయగ్రీవ రావు, ఉడత్తు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

# భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తుకు అమరావతి ముఖద్వారం: సీఎం చంద్రబాబు

**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశానికి ముఖద్వారంగా (గేట్‌వేగా) తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ దిశగా మరో కీలక అడుగు పడింది. ప్రపంచంలోని ప్రముఖ క్వాంటం కంప్యూటింగ్ సంస్థ 'క్వాంటినమ్' సీఈవో డాక్టర్ రాజీబ్ హజ్రాతో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు నిన్న సమావేశమవడం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యం ద్వారా దేశ క్వాంటం ఆశయాలను బలోపేతం చేయడంపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా కీలక వివరాలను పంచుకున్నారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా ఏపీలో ఒక సమగ్ర వ్యవస్థను (ఎకో సిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పరిశోధన, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, క్వాంటం హార్డ్‌వేర్, సప్లై చైన్, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, వాణిజ్యీకరణ వంటి అన్ని అంశాలపై దృష్టి సారించనున్నట్లు వివరించారు.

# మెగా పేరెంట్స్ డే





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జార్జి కారనేషన్ హైస్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డే అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లి దండ్రులకు ముగ్గుల పోటీలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. 10 వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రివార్డ్ లు అంద జేశారు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రుల తో ఉపాధ్యాయులు, కూటమి నాయకులు గడ్డంరాజు,అక్కు మంతి, వెంకట్రావు,రాజా, మౌలాలి,ప్రసాద్, జిలాని,చంటి,మూసా,తదితరులు పాల్గొన్నారు విద్యార్థుల తల్లి దండ్రులకు ముగ్గుల పోటీలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



మచిలీపట్నం మండలం తాళ్ళపాలెం పంచాయతీ జెడ్పీ పాఠశాలలో మెగా పేరెంట్స్ కార్యక్రమం లో మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు జాయింట్ కలెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

–మచిలీపట్నం,కలంకౌంటర్ :

# బ్రాహ్మణ సొసైటీ బలోపేతం చేసుకుందాం

## –బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్



**మంగళగిరి,కలంకౌంటర్ :** బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నందు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క బ్రాహ్మణ పురుషులు, మహిళలు సభ్యత్వం తీసుకుని బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీని బలోపేతం చేసుకుందాము అని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కె. బుచ్చి రాంప్రసాద్ అన్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్, ఏవి రమణ కు బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యత్వ బాండ్, ఐడి కార్డ్ ను బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కె. బుచ్చి రాంప్రసాద్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్, గోర్తి శ్రీనివాస్ లు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కె. బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లో 18 సంవత్సరాలు నిండిన బ్రాహ్మణ పురుషులు, మహిళలు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని బలోపేతం చేయాలని బ్రాహ్మణులను కోరారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలు లోపు వారు బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో 600 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే వారికి ఎటువంటి మరణం సంభవించిన 50 వేల రూపాయలు ఇన్సూరెన్స్ కవరేజ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా వెంటనే వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరుగుతుంది అన్నారు.

# కేంద్ర పన్నుల శాఖలో పూర్తిస్థాయి అధికారిగా అంబటి కీర్తి నాయుడు




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కేంద్ర పరోక్ష పన్నులు మరియు కస్టమ్స్ శాఖలో వైజాగ్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గా పనిచేస్తున్న రాజమండ్రికి చెందిన అంబటి కీర్తి నాయుడు పూర్తిస్థాయి అధికారిగా ధృవీకరిస్తూ హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన కమిషనరేట్ ఆమెను ఇన్‌స్పెక్టర్ కేడర్ అధికారిగా ధృవీకరిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. క్రమశిక్షణ, నిబద్ధత, సమర్థవంతమైన సేవల ఆధారంగా ప్రొబేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం ఈ గుర్తింపు లభించడం విశేషం. ప్రభుత్వ సేవలో ఆమె సాధించిన ఈ మైలురాయి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషుల్లో ఆనందాన్ని నింపింది. అంబటి కీర్తి నాయుడు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకొని ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించాలని రాజమండ్రి బార్ అసోసియేషన్ సభ్యులు, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ కీర్తి నాయుడు ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల నిరసనకు న్యాయవాదుల సంఘం మద్దతు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** దేశ రాజధాని ఢిల్లీ లో విద్యార్థుల నిరసన సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం అధ్యక్షులు తుంగల హరిబాబు నేతృత్వంలో న్యాయవాదులు విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని, కఠిన చట్టాల ద్వారా విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. వారి ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు, వైస్ ప్రెసిడెంట్ డి. శివకుమార్, జనరల్ సెక్రటరీ సర్వా లలితకుమారి, సీనియర్ న్యాయవాదులు జె. నెహ్రూ, గుండు ప్రకాష్, పి. సూర్యప్రకాష్, ప్రభాకర్, రఘురామ్, ఇంకా మహిళా న్యాయవాదులు క్రాంతి, శరణ్య, సీత, విజయ, రమణి, కృప, నాగమణి, రెజీనా, జగతి తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ కార్యక్రమం లో లంకిశెట్టి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మెగా పేరెంట్స్ , టీచర్స్ 4.0 స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలనుండి ప్రభుత్వ కళాశాలలప్రవేశలలో విద్యార్థులు సంఖ్య పెరిగింది అన్నారు.తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య, అర్హత కల్గిన అధ్యాపకులు దీనికి కారణం అన్నారు.ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం దాదాపు 500 పైన అడ్మిషన్స్ అయ్యినట్లు అన్నారు. తల్లికి వందనం కూడా అందరికి జమ అయింది అన్నారు . ఈ కార్యక్రమం లో దాదాపుగా 600 మంది పేరెంట్స్ సధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com